# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-01-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారత్‌లో ఆటోమొబైల్ రంగం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణల దిశగా ముందుకువెళ్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

2. **సైబర్ నేరాల నియంత్రణకు 'సంచార్ సాథీ' పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని కేంద్ర టెలికమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా తెలిపారు.**

3. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశమైంది.**

4. **రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

5. **కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రేపటి నుంచి రెండు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు.**

===========================

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో ఈరోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2024 జాతీయ క్రీడా పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రపంచ చెస్ చాంపియన్ డి గుకేశ్, పారిస్ ఒలింపిక్స్ లో పతకాలను సాధించిన మను భాకర్, భారత హాకీ బృందం కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్, పారిస్ పారాలింపిక్స్ లో బంగారు పతక విజేత ప్రవీణ్ కుమార్లకు మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డును రాష్ట్రపతి అందజేశారు. వీటితో పాటు 32 అర్జున అవార్డులు, 5 ద్రోణాచార్య అవార్డులను ప్రధానం చేశారు.

---------------------------

భారత్‌లో ఆటొమొబైల్ రంగం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణల దిశగా ముందుకువెళ్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని భారత మండపంలో "భారత్ మోబిలిటీ గ్లోబల్ ఎక్స్ పో 2025 " ను ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ,

వాయిస్ (35 సెకన్లు )

కాగా ఈనెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరిగే ఈ ఎక్స్ పో లో పలు అంతర్జాతీయ సంస్థలు తమ వాహనాలను ప్రదర్శిస్తున్నాయి.

---------------------------

సైబర్ నేరాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం 'సంచార్ సాథీ' పేరుతో ఒక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని కేంద్ర టెలికమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా తెలిపారు. ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా సంచార సాథీ ఆప్, జాతీయ బ్రాడ్ బ్యాండ్ మిషన్, డిజిటల్ భారత్ నిధి కార్యక్రమాలను కేంద్ర మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన ప్రసార మాధ్యమాల అనుసంధానానికి జాతీయ బ్రాడ్ బ్యాండ్ మిషన్ ను ప్రారంభించామని జ్యోతిరాధిత్య సింధియా తెలియజేస్తూ,

వాయిస్ ( 32 సెకన్లు )

ఈ కార్యక్రమంలో విజయవాడ నుంచి కేంద్ర టెలికమ్యూనికేషన్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ అదనపు డైరెక్టర్ జనరల్ జె. వి రెడ్డి ఇతర ఉన్నాతాధికారులు పాల్గొన్నారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు వివిధ సంక్షేమ పథకాలపై చర్చిస్తున్నారు. అలాగే పరిశ్రమలకు భూముల కేటాయింపులు, 10 శాతం మద్యం దుకాణాలను గీత కార్మికులకు కేటాయించడం వంటి అంశాలపై కూడా మంత్రి వర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

---------------------------

ప్రతి నెలా మూడో శనివారం తప్పని సరిగా 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించేలా కార్యాచరణ రూపొందించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. వెలగపూడి సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో ఆయన దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, వైఎస్సార్ జిల్లా మైదుకూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులను, ప్రజలను ఇందులో భాగస్వాములు చేసేలా చర్యలు తీసుకుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి నెల ఒక అంశాన్ని ఎంచుకొని స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

---------------------------

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రేపటి నుంచి రెండు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. రేపు రాత్రి ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారు. మరుసటి రోజు ఉదయం కృష్ణా జిల్లా, గన్నవరం సమీపంలో నిర్మించిన జాతీయ విపత్తు స్పందన దళం ఎన్డీఆర్ఎఫ్ పదవ బెటాలియన్ ను, అలాగే జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ -ఎన్ఐడీఎం కేంద్రాన్ని అమిత్ షా ప్రారంభించి ప్రసంగిస్తారు.

---------------------------

రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సూరసేన యానంలో జరిగిన సంక్రాంతి సంబరాలు ముగింపు కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణహిత,

ఆధ్యాత్మిక పర్యాటక విభాగాలలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సూరసేన యానాం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఏలూరు జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు అధికారులందరూ సమిష్టిగా పనిచేయాలని జిల్లా ఇన్ ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏలూరులోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాకు మంజూరైన అభివృద్ధి పనుల్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. రహదారులకు మరమ్మతులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని పారిశ్రామికవాడలు ఏర్పాటు చేసి ఔత్సాహికులను ప్రోత్సహించాలని.. అందుకు ప్రతి మండలంలో అందుబాటులోని భూమిని గుర్తించాలన్నారు. కొల్లేరు ప్రాంత పేదల సమస్యలను పరిశీలించి మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

రహదారి భద్రతా మాసోత్సవాల ద్వారా ప్రజలలో రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఎ. మోహన్ తెలిపారు. విజయవాడలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రహదారి భద్రత మాసోత్సవాల గోడపత్రికలను, కరపత్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ . జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబులతో కలిసి నిన్న ఆయన విడుదల చేశారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధలను పాటించని వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. భద్రతా మాసోత్సవాలలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతూ,

వాయిస్ (30 సెకన్లు )

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 118వ సంచిక ఈనెల 19వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈ రోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

చిత్తూరు సమీపంలో ఈ రోజు తెల్లవారుజామున జరిగిన రహదారి ప్రమాద ఘటనలో నలుగురు మృతి చెందారు. చిత్తూరులోని గంగాసాగరంవద్ద ఆగివున్న టిప్పర్ ను తిరుపతి నుంచి మధురై వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడి చికిత్సపొందుతున్న వారిని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరామర్శించారు. రోడ్డు ప్రమాద ఘటన బాధాకారమని జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

======================